ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 23 ఆగస్టు 2025



రాజన్నకు భక్త నీరాజనం

- శ్రావణమాసం చివరి రోజున మొక్కులు చెల్లింపు
- మహాలక్ష్మి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన మహిళలు



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ఆవరణ

పల్లె మురిసేలా 'అభివృద్ధి' జాతర

- జిల్లాలో ఉపాధిహామీ పనులకు శ్రీకారం
- 260 గ్రామాలు.. 2,068 పనులతో కార్యాచరణ
- తొలి రోజు రూ 7.79 కోట్లతో 255 పనులకు భూమి పూజలు
- అభివృద్ధి, ఆస్తుల కల్పనే లక్ష్యంగా పనులు
- పనులను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



గేదెలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో కొద్ది రోజులుగా పల్లెల్లో స్తబ్ధత నెలకొంది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పల్లెల్లో అభివృద్ధి పరిస్థితి మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తాజా నిర్ణయంతో గ్రామాల్లో కొత్త పనులతో భూమిపూజలు, పాతపనులు పూర్తిచేయడం, ప్రారంభోత్సవాలతో సందడిగా మారింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంతో అట్టహాసంగా ఉపాధిహామీ పనుల జాతర-2025 మొదలైంది. గ్రామీణప్రాంతాల్లో అభివృద్ధి, ఆస్తుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉపాధిహామీపథకం, స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ), ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్‌శాఖల ద్వారా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 260గ్రామపంచాయతీల్లో శుక్రవారం ఏకకాలంలో పనుల జాతర సందడి మొదలైంది. జిల్లాలోని కోనరావుపేట, చందుర్తిమండలాల్లో ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ రైతులకు పాడి గేదెల పంపిణీ చేపట్టారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముస్తాబాద్ మండలం ఆవునూరులో పశువులపాక నిర్మాణానికి భూమిపూజ చేశారు. బోయిన్‌పల్లి మండలంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తంగళ్లపల్లిలో గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ పలు పనులకు భూమి పూజ చేశారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ఇల్లంతకుంట, వేములవాడ, వేములవాడరూరల్, రుద్రంగి మండలాల్లో అధికారులు, ప్రజాప్రతి నిధులు పనులకు శ్రీకారం చుట్టారు.

● తొలి రోజు 255 పనులకు శ్రీకారం..

ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 260 గ్రామాల పరిధిలో 2,068 పనులు చేపట్టాలని గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాచరణ రూపొందించింది. ఇందిరా మహిళాశక్తిఉపాధి భరోసాద్వారా జీవనోపాధి కార్యక్ర మాల ప్రణాళిక రూపొందించారు. మహిళా సంఘాలకు పశువులు, గొర్రెల షెడ్లు, కోళ్లపెంపకం, పండ్ల తోటలు, వ్యవసాయబావులు నిర్మాణం, పొలం బాటలు, కమ్యూనిటీ శానిటరీకాంప్లెక్స్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, ఇంకుడు గుంతలు వంటి పనులు చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించారు. జిల్లాలోని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు అధికారులు ప్రారంభించిన పనులు వచ్చే

-మిగతా 8లో

పీఎంకేఎస్‌వై ప్రతిపాదనలను అందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) 3.0 ప్రతిపాదనలను మూడురోజుల్లో సంబంధిత అధికారులు అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పీఎంకేఎస్‌వై ప్రతిపాదనలపై సమీక్షా సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో క్లస్టర్ వాటర్‌షెడ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎంపిక చేయాలన్నారు. ప్రతి నీటి చుక్కను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పంట పొలాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కృషి సించాయే యోజన 3.0ను ప్రవేశ పెట్టిందని అన్నారు. గ్రామాల్లో పథకం కింద నూతన ప్రతిపాదనలు శాఖల వారీగా మూడు రోజులల్లో తయారుచేసి డీఆర్‌డీవోకు అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ది అధికారి శేషాద్రి, సీపీవో మల్లేశం, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌పై న్యాయమూర్తి సమీక్ష



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జ్ అజయ్‌కుమార్ జాదవ్

వేములవాడ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి రాధిక జైస్వాల్ శుక్రవారం వేములవాడ కోర్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. లోకఅదాలత్‌లో రాజీ చేయదగిన సివిల్, క్రిమినల్ ఇతర కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని న్యాయమూర్తి ఆదేశించారు. వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌తో కలిసి మొదట బార్ అసోషియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులతో, అనంతరం వేములవాడ పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశమయ్యారు. లోక్ అదాలత్ విజయవంతానికి తీసుకోవల్సిన చర్యలపై సూచనలు, సలహాలిచ్చారు. సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్ అభ్యర్థన మేరకు కోర్టు ఆవరణలో ప్రతీ శుక్రవారం కక్షిదారులకు అందిస్తున్న ఉచిత భోజన సౌకర్యాన్ని న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజిరెడ్డి, విక్రాంత్ సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాల ఆకస్మిక తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ

తంగళ్లపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని కస్తూర్బా పాఠశాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించారు. అలాగే తరగతి గదులు, స్టోర్ రూం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్లం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, నాయకులు మోర కిరణ్ తదితరులు ఉన్నారు.

నాయకమ్మ ఆలయంలో పూజలు

గంభీరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని నాయకమ్మ ఆలయంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య శ్రావణ చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అనాధిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నాయకమ్మ తల్లి మున్నూరు కాపులతో పాటు అందరిని చల్లగా చూడాలని జిల్లా అధ్యక్షుడు దేవయ్య వేడుకున్నారు. కుల సంఘానికి చెందిన మహిళలు కొబ్బరి కాయలు కొట్టి, మంగళహారతులు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, జిల్లా ప్రచార కార్యదర్శులు బండారి బాల్‌రెడ్డి, ఇప్పపూల లక్ష్మణ్, రాష్ట్ర కమిటీ నాయకులు సురేష్, మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి కిరణ్, సంఘం నాయకులు ప్రశాంత్, అడవయ్య, లక్ష్మణ్ , శ్రీను, మల్లేశం, బాలయ్య, లింగం, రవి, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అర్బన్ మండల స్థాయి ఆటల పోటీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వహణ వల్ల మానసికోల్లాసంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. యువత సన్మార్గంలో నడిచేందుకు, గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు సీఎం రూపొందించిన ప్రణాళిక లను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వ్యక్తులను కౌన్సెలింగ్ ద్వారా మార్పే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. వేములవాడ ప్రాంతంలో మినీ స్టేడియం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, మర్రిపల్లి ప్రాంతంలో ఐదెకరాల స్థలంలో క్రీడామైదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాంపల్లి సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, చిలువేరి శ్రీనివాస్, బొజ్జ భారతి, రాగిరి నాగరాజు ఉన్నారు.

ఆరోగ్యంపై దృష్టిసారించాలి..

ప్రతీఒక్కరు ఆరోగ్యంపై దృష్టిసారించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ప్రెస్‌క్లబ్-హెచ్ 143 ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి ప్రభుత్వ విప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజలకు గుండె వ్యాధులు, సాధారణ వ్యాధులకు ప్రత్యేక వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందిం చడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్- హెచ్143 అధ్యక్షుడు రఫీక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిపాక నర్సయ్య, జితేందర్‌రావు తదితరులు ఉన్నారు.

స్కావెంజర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్కావేంజర్లు, నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావేంజర్స్, స్వీపర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని ఏఐటీయూసీ ప్రభుత్వ పాఠశాల స్వీపర్స్, స్కావేంజర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ యాదవ్, కో-కన్వీనర్ బోడ్డు నర్సవ్వ డిమాండ్ చేశారు. సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ప్రభుత్వ పాఠశాల స్వీపర్స్, స్కావేంజర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్స్, స్కావేంజర్లు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీపర్స్, స్కావేంజర్లకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వేతనాలను ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా వారి ఖాతాల్లో జమచేయాలన్నారు. వారికి ప్రతి నెలా 15వేల రూపాయలు చెల్లించా లన్నారు. గత సంవత్సరంలో ఏడు నెలల వేతనాలు ఇవ్వలేదన్నారు. దీనిపై ఎన్నిసార్లు జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు కలెక్టర్‌కు వినతి పత్రాలను అందించినా ఎలాంటి స్పందన లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి, మల్లవ్వ, లక్ష్మీకాంత, సుశీల, బాలలక్ష్మి, సునిత తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దు

ఇల్లంతకుంట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా యూరియా కొరత ఉన్నప్పటికీ అధికారులు కొరతలేదని ప్రకటనలు చేయడం సరైనది కాదన్నారు. యూరియా కోసం రైతులు గ్రామాల్లో బారులుతీరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రైతులను కష్టాలు పెట్టిన ఏ ప్రభుత్వం మనగడ సాగించలేదన్నారు. ఇప్పటికైనా సరిపడా యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు.

త్వరలో ఆలయ పునరుద్ధరణ పనులు

ఇల్లంతకుంట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామంలోని పురాతనమైన నర్సింహ్మస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని ఈవో మారుతిరావు పేర్కొన్నారు. కొద్దినెలల క్రితం ఆలయపైకప్పు కూలగా శుక్రవారం శిథిలాలను తొలగించారు. ఆలయ నిర్మాణంలో దాతలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, నాయకులు రొండ్ల రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సగౌడ్, శీలం శ్రీనివాస్, రాజమల్లేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నిరుపేద బత్తుల నారాయణ కుటుంబానికి రాచర్లగొల్లపల్లిలోని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మురళీమోహన్ శుక్రవారం 50 కిలోల బియ్యం వితరణ చేశారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు దాసు, సాయిచంద్, ప్రశాంత్, బాలకిషన్, సాగర్, శేఖర్, బాలకృష్ణ, నరేందర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



విద్యార్థులు రాసిన కథలతో మండల విద్యాధికారి

ఇల్లంతకుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. కందికట్కూర్ గ్రామంలోని హరిజనవాడ పాఠశాలలో శుక్రవారం నాపుస్తకం, నాకథ అనే నినాదంతో రీడింగ్ క్యాంపెయిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతిపాఠశాలలో సెప్టెంబరు 8వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువోజు రాజు, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ పరిపాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అంగూరి రంజిత్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి బీజేపీ ప్రభుత్వం నిధులు పెద్దగా కేటాయించలేదని ఆరోపించారు. పార్లమెంట్‌లో మెజారిటీ ఉందని నూతన జాతీయ విధానం -2020ని ప్రవేశ పెట్టిందని బిల్లు ప్రధాన ఉద్దేశం ఈ దేశంలో అసమానతలను పెంచి పోషించేలాగా ఉందని అన్నారు. దేశంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు అనుమతులిస్తూ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిరివీర్యం చేసే కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు బుర్ర రవితేజ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి నాగరాజు, డీవైఎస్ఐ జిల్లా కార్యదర్శి మల్లారుపు అరుణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, లంబాడి ఐక్య వేదిక నాయకులు బానోత్ నరేష్‌నాయక్, బహుజన విద్యార్థి నాయకుడు శ్రీధర్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో యూరియా తిప్పలు

గంభీరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి సింగిల్‌విండో కార్యాలయం వద్ద రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడ్డారు. యూరియా కోసం క్యూ లైన్‌లో గురువారమే చెప్పులు, రాళ్ల పెట్టారు. సాయంత్రం యూరియా వచ్చినప్పటికీ మరుసటి రోజు ఆధార్ కార్డుల ప్రకారం యూరియా ఇస్తామని సింగిల్‌విండో సిబ్బంది చెప్పారు. దీంతో శుక్రవారం ఆధార్ కార్డులతో రైతులు సింగిల్‌విండో కార్యాలయం వద్దకు వచ్చి బారులు తీరారు. సరిపడా యూరియా బస్తాలు రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఆధార్‌కార్డులు తీసుకుని రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎస్ఐ రమాకాంత్, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో వచ్చి రైతులను సముదాయించారు. వచ్చిన యూరియా బస్తాలను వరుస క్రమంలో రైతులకు అందజేసి, మిగిలిన రైతులకు మళ్లీ యూరియా రాగానే ఇస్తామని నచ్చజెప్పి పంపించారు.



కొత్తపల్లిలో రైతులను సముదాయిస్తున్న ఎస్ఐ రమాకాంత్

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రైతులకు యూరియా కొరత ఏర్పడిందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమయ్యే యూరియా, డీఏపీలను అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు కష్టాలు పడుతున్నారని విమర్శించారు. రైతులకు ఎంత అవసరమో కేంద్రానికి నివేదిక పంపితే కేంద్ర ప్రభుత్వం అంతే పరిమాణంలో పంపించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా అంచన వేయకపోవడమే రైతులకు శాపంగా మారిందన్నారు. ఓటు చోరీ విషయంలో ఎమ్మెల్సీ దయాకర్ చేసిన వ్యాఖ్యాలు అర్థరహితమన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, బర్కం వెంకటలక్ష్మీ, మండలాల అధ్యక్షులు మిర్యాల్‌కార్ బాలాజీ, కొడే రమేష్, సోల్ల క్రాంతి, మోకీలే విజయేందర్, బూరుగుపల్లి పరమేష్, బుర్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య


మల్లేశం(ఫైల్)

కోనరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలం నిమ్మపల్లి గ్రామానికిచెందిన బోయిని మల్లేశం(55) అనేవ్యక్తి అనారోగ్యంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. మల్లేశం తల్లి దుర్గవ్వ వృద్ధాప్యంలో ఉండగా భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు పెళ్లి చేసి అత్తగారింటికి పంపారు. మృతుడు మల్లేశం టైలరింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో కడుపులో కణితి కాగా ఆపరేషన్ చేయించుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత మళ్లీ మూత్రంలో మంట రావడంతో వైద్యులను సంప్రదించగా ప్రోస్టేట్ గ్రంధి పెరిగిందని ఆపరేషన్ చేయించాలని చెప్పడంతో మళ్లీ ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా మూత్రం మంట తగ్గకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది నిమ్మపల్లి గ్రామశివారులోని విద్యుత్‌సబ్‌స్టేషన్ దగ్గరలో ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా జీవితం మీద విరక్తి చెంది చనిపోతున్నానని, నాకు ఎవరూ శత్రువులు లేరని, ఆరోగ్యం సహకరించడం లేదని, నేను ఉరివేసుకుని చనిపోతున్నందుకు నన్ను క్షమించాలని, బంధువులకు, గ్రామస్థులకు చివరి నమస్కారం అని రాసిన లెటర్ పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడు మల్లేశం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


నారాయణ(ఫైల్)

ధర్మారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీసర్పంచ్ భర్త గంధం నారాయణ(53) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. రోజులాగే శుక్రవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన నారాయణ ఎంతకు తిరిగి రాకపోవడంతో భార్య వరలక్ష్మి ఫోన్‌చేసింది. ఫోన్‌రింగ్ అయినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చిన వరలక్ష్మి కొడుకు అక్షయ్‌ను పొలం వద్దకు పంపింది. పొలం వద్దకు వెళ్లిన అక్షయ్ తండ్రి నారాయణ విగతజీవిగా పడి ఉండడంతో తల్లి వరలక్ష్మికి సమాచారం అందించారు. వెంటనే నారాయణను చికిత్స నిమిత్తం హుటాహుటిన కరీంనగర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మోటారు స్టార్టర్‌నుంచి ఒకవైరు బయటకు ఉండడాన్ని గమనించకుండా మోటార్ ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై కిందపడిపోయి చనిపోయి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన భర్త మృతిపై అనుమానం ఉందని నారాయణ భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గంధం నారాయణ రచయిత, కవి, గాయకుడిగా మండల ప్రజలకు సుపరిచితుడు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


నవీన్(ఫైల్)

ఇల్లందకుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రివానిపల్లె గ్రామానికి చెందిన పెండ్లి నవీన్(24) పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెండ్లి సమ్మయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒకకుమారుడు ఉన్నాడు. కుమారుడు నవీన్ తల్లిదండ్రులతోపాటు వ్యవసాయం పనులు చేస్తుండేవాడు. ఈనెల19న తల్లిదండ్రులు వ్యవసాయ పనులకువెళ్లి ఇంటికి వచ్చేసరికి నవీన్ వాంతి చేసుకుంటున్నాడు. ఏంజరిగిందని అడుగగా, గడ్డిమందు తాగినట్లు చెప్పాడు. వెంటనే అతన్ని జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. నవీన్ ఆరోగ్యం మళ్లీ బాగా లేకపోవడంతో గురువారం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అక్కడ శుక్రవారం మృతిచెందాడు. మృతుడు నవీన్ తండ్రి సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఉరి వేసుకొని వృద్ధుడి బలవన్మరణం


పోచయ్య(ఫైల్)

శంకరపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్య తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం శంకరపట్నం మండలం కాచాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామా నికి చెందిన తడిగొప్పుల పోచయ్య(75) మూడేళ్లనుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులు తిరిగినా వ్యాధి నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం తెల్లవారుజామున తన ఇంట్లోనే వాసానికి బెల్టుతో ఉరేసుకొని మృతిచెందాడు. మృతుడి కుమారుడు తడిగొప్పుల రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

మల్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మల్యాల మండల కేంద్రానికి చెందిన బైరి భీరయ్య(68) అనే వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. కూలిపని చేసుకునే భీరయ్యకు అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో శుక్రవారం ఇంట్లోనే ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రాయికల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన బరతాల రాజేందర్ (30) అనే వికలాంగుడు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. రాజేందర్ గురువారం రాత్రి గ్రామంలోని హనుమన్ ఆలయం వద్ద రోడ్డును దాటుతుండగా జగిత్యాల వైపు నుంచి రాయికల్ వెళ్తున్న ఏపీ 15 ఎక్స్ 0104 నెంబర్ గల ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన రాజేందర్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవేందర్ తెలిపారు.

అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

మానకొండూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అత్తింటివారి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన గోనెల తిరుమలయ్య తన కూతురు శైలజ(26)ను మండలంలోని పిల్లి నాగరాజుతో 2021లో వివాహం జరిపించారు. ఏడాది నుంచి భర్త నాగరాజుతో పాటు అత్తమామలు ఎల్లవ్వ, మల్లయ్య, బావ సంతోష్, అతని భార్య మమత శారీరకంగా వేధిస్తున్నారు. ఆ వేధింపులు భరించలేక శైలజ గురువారం రాత్రి ఇంట్లో చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు శైలజ తండ్రి తిరుమలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కిడ్నీలు పాడై మహిళ మృతి

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ఓవివాహిత కిడ్నీలు పాడై మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పులి రుద్రమదేవి(35) రెండు కిడ్నీలు పాడైపోవడంతో కొన్నినెలలుగా డయాలసిస్ చేయించుకుంటోంది. డయాలసిస్ చేసినా ఫలితం లేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటూ మృతిచెందింది. మృతురాలికి భర్త పులి రాజు, కుమార్తెలు రుష్మిక, పరిణిక ఉన్నారు. తల్లి మృతదేహం వద్ద ఇద్దరు కూమార్తెలు దీనంగా చూస్తున్న దృశ్యం గ్రామస్థులను కంటతడి పెట్టించింది. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పక్కా భవనాలకు మోక్షమెప్పుడో?

- అరకొర వసతులతో అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, సిబ్బంది


తాండ్ర్యాలలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

కథలాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నా కథలాపూర్ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మాత్రం నిర్మించడం లేదు. ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతుండగా అరకొర వసతుల మధ్య చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లకు అవస్థలు తప్పడం లేదు. ఆరేళ్ల లోపు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించి శిశు మరణాలకు అడ్డుకట్ట వేసే ఉద్దేశ్యంతో కేంద్రాలను కొనసాగిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఆట బొమ్మలతో పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా


అంబారిపేటలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

చిన్నారులను ప్రాథమిక విద్యపై ఆసక్తిని పెంచే ప్రక్రియను కూడా ప్రారంభించారు. అయితే పక్కా భవనాలు లేని కారణంగా కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణం కరవైందని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు.

● అద్దె భవనాలే దిక్కు

కథలాపూర్ మండలంలో 49 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 9 మాత్రమే పక్కా భవనాల్లో కొనసాగుతున్నాయి. 21 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా 19 కేంద్రాలను సమీప ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగిస్తున్నారు. మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 3,397 మంది హాజరవుతున్నారు. అయితే అద్దె భవనాల్లో నామమాత్రపు సౌకర్యాలు ఉండడంతో కేంద్రాల నిర్వహణ కష్టంగా ఉందని అం గన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక సార్లు అధికా రులకు, ప్రజా ప్రతినిధులకు మొర పెట్టు కున్నా ఫలితం లేదని పేర్కొంటున్నారు. పాఠశాలల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు చోట్ల పురాతన భవనాలను కేటాయించగా శిథిలావస్థలో ఉన్న ఆ భవనాల్లో ప్రమాదం పొంచి ఉంది. చింతకుంట పాఠ శాలలో ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరగడంతో గదులు వారికే సరిపో వడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం అద్దె భవనం కూడా అందుబాటులో లేకపోవడంతో అక్కడి టీచర్‌కు సమస్యగా మారింది. కోడిగుడ్లు, పాలు, బాలామృతం నిల్వ చేసే సదుపాయం కూడా లేకుండా పోయింది. ప్రభుత్వం నుంచి అద్దె చెల్లింపులు కూడా ఏడాదికోసారి ఉండడం వల్ల భవన యజమానులు అద్దె ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని తెలిసింది. అద్దె భవనాలు ఇరుగ్గా ఉండడం వల్ల అనుబంధ ఆహారం, ప్రీస్కూల్ కార్యక్రమాలు, చిన్నారుల ఎత్తు, బరువు, చుట్టు కొలతలు తీసుకోవడం టీచర్లకు ఇబ్బందిగా ఉంటోంది. ఇటీవల గంభీర్‌పూర్, దూలూరు, సిరికొండ గ్రామాలకు పక్కా భవనాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు.

పక్కా భవనాలకు ప్రతిపాదనలు

- స్రవంతి, సూపర్‌వైజర్, చింతకుంట



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉంటే పూర్తిస్థాయి వసతులతో ఆహ్లాదకర వాతావరణంలో కేంద్రాలను నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. సరుకుల నిల్వ, మరుగుదొడ్లు, బోధించడానికి తరగతి గది ఉంటే అందమైన, ఆకర్షణీయమైన బొమ్మలు ప్రదర్శిస్తూ ప్రీస్కూల్ నిర్వహించడానికి ఆస్కారం ఉంటుంది. పక్కా భవనాల నిర్మాణాల కోసం జిల్లా అధికారులకు నివేదికలు పంపిస్తాం.

ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్థులు


ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న గ్రామస్థులు

తిమ్మాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోనే నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బాలయ్యపల్లి గ్రామస్థులు కొందరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వాహనాన్ని అడ్డుకున్నారు. నూతనంగా ఏర్పడిన బాలయ్యపల్లికి సాహెబ్‌పల్లి అనుబంధగ్రామం. సాహెబ్‌పల్లిలో ప్రభుత్వభూమి ఉండటంతో గ్రామపంచాయతీ భవనం నిర్మించేందుకు శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో కలిసివచ్చి శంకుస్థాపనచేశారు. అయితే బాలయ్యపల్లిలోనే గ్రామపంచాయతీ భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ కొందరు గ్రామస్థులు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తతనెలకొనగా పోలీసులువారిని అడ్డుకోవడంతోవివాదం సద్దుమనిగింది.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువతి గొస్కి అంజలి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామంలోని కృష్ణహరి చిన్న కూతురు అంజలి డిగ్రీ వరకు చదువుకుని కుటుంబీకులతో కలిసి ఇంటి వద్ద ఉంటోందని పేర్కొన్నారు. ఈనెల22న కృష్ణహరి భార్య పని నిమిత్తం కూతురును ఇంటి వద్ద ఉంచి సిరిసిల్లకు వెళ్లిందని చెప్పారు. తిరిగి వచ్చేసరికి కూతురు అంజలి కనిపించలేదని తెలిపారు. బంధువులు, చుట్టుపక్కల ఆరా తీసినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. బాధితుడు కృష్ణహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

27 మంది బైండోవర్

జగిత్యాల క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :గణేష్ ఉత్సవాల నేపథ్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో 27 మందిని శుక్రవారం అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

విద్యార్థినిపై అత్యాచారయత్నం చేసిన..

స్వీపర్‌కు పదేళ్ల జైలు శిక్ష

కోల్‌సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై అత్యాచార యత్నానికి పాల్పడిన స్వీపర్ షేక్ సర్వర్‌కు శుక్రవారం పెద్దపల్లి కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించింది. 2019లో క్లాస్‌రూమ్‌లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారయత్నానికి ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించింది. దీంతో షేక్ సర్వర్ ఆమెను చితకబాది ఎవరికి చెప్పవద్దని బెదిరించాడు. బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటిసీఐ పర్వతమేష్, ఏసీపీ ఉమేందర్ కేసు విచారణ జరిపి చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా జడ్జి పెద్దపల్లి కోర్టులో విచారణ జరుగగా పీపీ బాదం రమేష్ ప్రాసిక్యూషన్ తరఫున నేరం రుజువు చేయించారు. దీంతో దోషికి పదేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. సాక్షులను ప్రవేశపెట్టడానికి సహకరించిన వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సతీష్‌కుమార్, కోటేశ్వర్‌రావులను సీపీ అంబర్‌కిశోర్ ఝా అభినందించారు.

కోతుల దాడిలో విద్యార్థినికి గాయాలు

కోనరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో పదో తరగతి విద్యార్థికి గాయాలయ్యాయి. కోనరావుపేట మండలం బావుసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న షేక్ రేష్మ అనే విద్యార్థినిపై కోతి దాడిచేయగా గాయపడింది. దీంతో గమనించిన ఉపాధ్యాయులు కోనరావుపేట ప్రాథమికఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని భయాందోళన గురవుతున్నామని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి కోతుల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హుజూరాబాద్‌లో లారీ బోల్తా

హుజూరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాల సమీపంలోని మూల మలుపు వద్ద శుక్రవారం అదుపు తప్పి లారీ బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి లోడ్‌తో వస్తున్న లారీ కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. గమనించిన స్థానికులు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఇప్పటివరకు జూనియర్ కళాశాల సమీపంలో ఈ ఏడాదిలో ఐదు సంఘటనలు జరిగినా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని కాంగ్రెస్ నాయకుడు ఎండీ అప్సర్ ఆరోపించారు. హెచ్చరిక బోర్డులు పెట్టని యెడల వారం రోజుల్లో సంఘటన స్థలం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు.

ఏడీ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా


చేనేత జౌళి శాఖ ఏడీకి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

తంగళ్లపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కు పవర్‌లూంకార్మికులు ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. శుక్రవారం సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొడం రమణ అధ్వర్యంలో కార్మికులు ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కూలి పెంపు తదితర సమస్యలతో కూడిన వినతిపత్రం ఏడీకి సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులో ప్లాట్లను 20సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి ఇప్పటివరకు పరిశ్రమలు ఏర్పాటు చేయని, పరిశ్రమలను ప్రారంభించి మూసివేసిన వారి ప్లాట్లను రద్దు చేసి పరిశ్రమలు నెలకొల్పి కార్మికులకు ఉపాధి కల్పించే వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. శనివారం పార్కు ప్రధానద్వారం వద్ద వంటవార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్ పార్కు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, శ్రీకాంత్, వేణు, సంపత్, అంజనేయులు, కనకయ్య, వరప్రసాద్, శ్రీనివాస్, రాజు, వెంకటేశం, అంబదాస్, నర్సయ్య, రవీందర్, సత్యనారయణ, భాస్కర్, ప్రశాంత్, మహేశ్ తదితరలు పాల్గొన్నారు.

● కార్మికులతో చర్చలు విఫలం..

సమ్మె చేస్తున్న కార్మికులతో శుక్రవారం చేనేత జౌళీశాఖ ఏడీ రాఘవులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. వారం రోజులలోపు ప్రభుత్వ వస్త్రాలకు సంబంధించి యజమానులతో చర్చలు జరిపించి కూలీ పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని కార్మికులు సమ్మె విరమించాలని ఏడీ కోరారు. ముందుగా చర్చలు జరిపి కూలి పెంచే వరకు సమ్మెను కొనసాగిస్తామని కార్మికులు తేల్చి చెప్పారు. ఆందోళన ఉధృతం చేస్తామని నేడు వంట వార్పు చేయనున్నట్లు ప్రకటించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


భూక్య భాస్కర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎన్టీఆర్ చౌక్ సమీపంలో శుక్రవారం విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో టాణా పోలీసుల వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం గండిపెల్లి గ్రామంలోని పంచరాయితండాకు చెందిన భూక్య భాస్కర్(20) మూడు నెలల నుంచి విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద కార్మికుడిగా పనిచేస్తూ భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం రాజామెస్ వద్ద విద్యుత్ స్తంభంపై పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు భాస్కర్ చేతిలో ఉన్న విద్యుత్‌వైరు పైన ఉన్న మరో విద్యుత్ తీగకు తగలడంతో ప్రమాదానికి గురై కిందపడి పోయాడు. తీవ్రగాయాలవడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గణేశ్‌నగర్: భాస్కర్ మృతికి విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్ బాధ్యత వహించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోమానాయక్, నరసింహ నాయక్, లక్పతి నాయక్, రాజు, శ్రేయస్, తిరుపతి రాజు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు

బావిలో పడి వ్యక్తి మృతి

వీణవంక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామనికిచెందిన కల్లేపల్లి రమేష్(39) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రమేష్ గురువారం గ్రామానికి చెందిన బంధువుల అంతక్రియలలో పాల్గొని అనంతరం స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. శుక్రవారం స్థానికులు వ్యవసాయ బావిలో మృతదేహన్ని గుర్తించారు. మృతుడు రమేష్ భార్య రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

నలుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తర లిస్తూ పట్టుబడిన నలుగురిని శుక్రవారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న టి క్రాంతి, పి. కనుకయ్య, ఎన్.శ్రీనివాస్, సి.సుధాకర్‌ను కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ఇల్లంతకుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామసమీపంలో వాహనాలను ఎంవీఐ వంశీధర్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వాహనదారులు తప్పనిసరిగా టాక్స్‌లు చెల్లించాలని పేర్కొన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టర్లను రవాణాకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని, వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల ఎన్నికల్లో తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి రుద్ర సంతోష్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అనుగుణంగా అసెంబ్లీలో బిల్లుపెట్టారని, కేంద్రప్రభుత్వానికి పంపినా ఇంతవరకు స్పందన లేదని అన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, బీసీ రిజర్వే షన్లను42శాతం సాధించాలని కోరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉందన్నారు. ఈనెల 24,25న రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఏఐసీసీ తెలంగాణఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ పాదయాత్రకు బీసీ సంఘాలు మద్దతు పలకాలని కోరారు. జేఏసీ నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు, దొగ్గలి శ్రీధర్, మియాపూర్ రవీంద్ర చారి, మహేష్ ఉన్నారు.

గోదావరి వరదలతో పంటలకు భారీ నష్టం

● ఆందోళన చెందుతున్న రైతులు

మంథనిరూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదల కారణంగా గోదావరి నది ఉధృతంగా ప్రవహించింది. నది పరివాహక ప్రాంతంలో ఉన్న పోతారం, విలోచవరం గ్రామాలలో వరి, పత్తి పంట పొలాలు దెబ్బతిన్నాయి. గోదావరి ఎగువ ప్రాంతంలో నుంచి భారీగా వరద నీరు రావడంతో సుందిళ్ల బ్యారేజి వద్ద గేట్లు ఎత్తి ఉండటంతో వరదతో పంటలు నీట


వరి పంటను కప్పి వేసిన బురద

మునిగాయి. మూడు రోజుల పాటు పంటలు నీటిలో ఉండటంతో సుమారు వంద నుంచి నూట యాభై ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లింది. గోదావరి ఒడ్డున ఉన్న పొలాలలో కొన్ని చోట్ల బురదతో కప్పి వేయగా, మరి కొన్ని చోట్ల కొట్టుకుపోయాయి. పత్తి పంటలు నీటిలో మునిగి ఉండటంతో మాడిపో యాయి. దీంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. దీంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. గోదావరి నదిని నమ్ముకొని పంటలు సాగు చేస్తే వరదలతో నష్ట పోయామని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి సర్వే చేసి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


పోతారంలో మాడిపోయిన పత్తి పంట

హెచ్‌టీ మీటర్లకు ఆటోమేటిక్ రీడింగ్

● ప్రయోగాత్మకంగా కరీంనగర్‌లో అమలు



విద్యుత్ మీటర్‌కు అమర్చిన ఏఎంఆర్ మోడెం

గణేశ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో 825హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. ఈ విద్యుత్‌ను సాధారణంగా పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తుంటారు. వీరు నెలకు సుమారు 180కోట్ల రూపాయలు బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం హెచ్‌టీ సర్వీసుల నెలవారీ మీటర్ రీడింగ్ ఏడీఈలు తీసుకుని మీటర్ కార్డుల్లోరాసి బిల్లింగ్ కోసం పంపుతున్నారు. దీంతో బిల్లింగ్ తేదీల్లో కొంత మార్పులు జరుగుతున్నాయి. ఈవిధానం ద్వారా రీడింగ్‌లో పొరపాట్లు జరిగే అవకాశం ఉంది. ఈ పొరపాట్లు జరగకుండా టీజీఎన్‌పీడీ సీఎల్ సీఎండీ ఆదేశాలమేరకు ప్రయోగాత్మకంగా జిల్లాలో ఆటోమేటిక్‌రీడింగ్ తీసుకునేందుకు విద్యుత్ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇప్పటివరకు 550హెచ్‌టీ సర్వీసులకు 4జీమోడెంలు ఏర్పాటుచేశారు. ఈ మోడెంలోని 4జీసిమ్ ద్వారా మీటర్‌కు సంబంధించిన మొత్తం సమాచారం ఎప్పటికప్పుడు వరంగల్ ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులోని కంప్యూటర్‌కు చేరుతుంది. ఆ సమాచారం ద్వారా ప్రతీవినియోగదారుడి మీటర్ స్థితిని, విద్యుత్‌వినియోగాన్ని, సరఫరా అంతరాయాన్ని తెలుసుకొని చర్యలు తీసుకుంటారు. మొత్తం హెచ్‌టీ మీటర్లకు పరికరాలను ఈ నెల ఆఖరు వరకు అమరుస్తారు. అనంతరం ఈ సర్వీసుల నెలవారీ మీటర్ రీడింగ్‌లు ఆటోమేటిక్‌గా నమోదవుతాయి. ప్రతి నెల ఒకటో తేదిన వినియోగదారునికి ఈ-మెయిల్ ద్వారా బిల్లు వస్తుంది. అతడు ఆన్‌లైన్‌లో బిల్లు చెల్లించవచ్చు. ఈ విధానం లో మీటర్ పని తీరులో ఏమైనా లోపాలు ఉన్నా అధికారులకు వెంటనే తెలుస్తుంది. దీనిద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించవచ్చు.



ఉపాధ్యాయులకు స్కౌట్స్, గైడ్స్‌లో శిక్షణ

- ఎనిమిది జిల్లాల నుంచి 80 మంది స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్
- పాల్గొన్న 12 మంది శిక్షకులు
- 24వరకు కొనసాగనున్న శిక్షణ శిబిరం

తిమ్మాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజికసేవ, దేశ భక్తి వంటివి పెంపొందించేందుకు స్కౌట్స్, గైడ్స్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించి విద్యార్థులకు ఈ విధానాన్ని అలవాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల డైట్ కళాశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 18న ప్రారంభమైన శిబిరం 24 వరకు కొన సాగుతుంది. ఈ శిబిరంలో కరీంనగర్, సూర్యాపేట్, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, కుమరం భీం ఆసిఫాబాద్, భూపాల్‌పల్లి, సిద్దిపేట జిల్లాల నుంచి 80 మంది స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్, 12 మంది శిక్షకులు పాల్గొంటున్నారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

● శిక్షణ అంశాలు

ప్రతి రోజు ఉదయం ప్రాతఃస్మరణ, జాతీయ జెండా ఆవిష్కరణ, ప్రార్థన, వ్యాయామం, యోగా, పరేడ్ ప్రాక్టీస్ ఉంటుంది. అనంతరం మ్యాపింగ్‌లో శిక్షణ ఇస్తారు. కంపాస్ (దిక్సూచి) సహాయంతో దిశలు గుర్తించడం, సర్వే చేయడం నేర్పిస్తారు. మధ్యాహ్నం గ్రూప్ డిస్కషన్, క్వశ్చన్ ఆన్సర్ సెషన్స్ నిర్వహిస్తారు. అనంతరం రోప్స్‌కు నాట్స్ వే యడం, ఏదైనా ఆపద సమయంలో సిగ్నల్స్ ఇవ్వడం, ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ ఇస్తారు. అనంతరం దూరాలు అంచనా వేయడం, ఎత్తులు కొలిచే పద్ధతులు నేర్పిస్తారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాస్టర్స్, కెప్టెన్స్ తమ అనుభవాలను పంచుకుంటారు. సామాజిక అంశాలపై చర్చిస్తారు. పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్ ఎలా ప్రారంభించాలనే విధానంపై శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజు ఫ్లాగ్ సెరిమనీ, మార్చ్‌ఫాస్ట్, డ్రిల్స్, స్కౌటింగ్ నైపుణ్యాలతో పాటు స్కౌట్ పాటలు, కథలు, క్యాంప్ ఫైర్, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు..

- కంకణాల రాంరెడ్డి, స్కౌట్స్, గైడ్స్ జిల్లా కార్యదర్శి



స్కౌట్స్, గైడ్స్ శిక్షణ శిబిరంలో మాస్టర్లు, కెప్టెన్లు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ శిబిరంలో ఉపాధ్యాయులు నేర్చుకున్న విషయాలు విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడతాయి.

విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

- వేల్పుల శిరీష, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, జగిత్యాల



గైడ్స్ ద్వారా విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. ఈ శిబిరంలో మాకు బోధించిన పద్ధతులు, ఆటల రూపంలో ఇచ్చిన శిక్షణ ప్రయోజనకరంగా ఉంది.

ప్రతి పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ ట్రూప్‌ను నిర్వహించాలి..

- షరీఫ్ అహ్మద్, లీడర్ ఆఫ్ ద కోర్స్, కరీంనగర్



ప్రతి టీచర్ వారి పాఠ శాలలో కనీసం ఒక స్కౌట్స్, గైడ్స్ ట్రూప్‌ను నిర్వహిం చాలి. విద్యార్థి స్కౌట్స్‌లో చేరితే ధైర్యవంతుడు, నిజాయితీగలవాడుగా రూపొందుతాడు. ఈ లక్షణాలున్న యువతతోనే సమాజం బలపడుతుంది. శిక్షణలో పాల్గొన్న టీచర్లు వేలాది మంది విద్యార్థులకు ఈ స్ఫూర్తిని పంచబోతున్నారు.

శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉంది

- కోమలత, కేజీబీవీ, కరీంనగర్



గైడ్ కెప్టెన్‌గా ఈ శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. గైడ్స్ శిక్షణ ద్వారా విద్యార్థినులు సేవా భావన, టీం స్పిరిట్, సమాజానికి ఉపయోగపడే వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటారు.

రాజన్నకు భక్త నీరాజనం

● శ్రావణమాసం చివరి రోజున మొక్కులు చెల్లింపు
● మహాలక్ష్మి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన మహిళలు



ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరిస్తున్న రాజన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. శ్రావణమాసం చివరిరోజు కావడంతో భక్తులు శుక్రవారం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భారీగా తరలి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● మహిళలు ప్రత్యేక పూజలు..

శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. శ్రావణ మాసం చివరి శుక్రవారంసందర్భంగా మహిళలు అమ్మవారికి నూతన వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం మహిళలు పసుపు, కుంకుమ, కనుములతో వాయినం ఇచ్చిపుచ్చుకుని తులసి పూజలో తరించారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. వేలాది భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి మొక్కులు తీర్చుకొని బేతాళుడు, శ్రీరాముల ఆలయంలో పూజలు జరిపారు. భక్తుల రద్దీ రాత్రి వరకు కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు

ప్రతీ పాఠశాలలో యోగా తప్పనిసరి చేయాలి

● యోగా అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



యోగాసన పోటీల్లో ప్రతిభ చాటుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యోగా తప్పనిసరి చేయాలని రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలోని యోగా హాల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమికస్థాయి నుంచి యోగాలో శిక్షణతో భవిష్యత్‌లో ఉన్నత స్థితికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాలల్లో యోగా అమలు కోసం జిల్లా అసోసియేషన్ తరపున కోచ్‌లతో సరిపడా ఆర్థిక వనరులు సమకూర్చనున్నట్లు చెప్పారు. జిల్లాలో యోగా అభివృద్ధికి అసోసియేషన్ విశేషంగా కృషిచేస్తోందని, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించిన ఘనత మన క్రీడాకారులదని అన్నారు. క్రమశిక్షణకు అంకితభావం తోడైతే క్రీడల్లో రాణించగలరన్నారు. జిల్లా క్రీడా, యువజనశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి కొత్తగా స్పోర్ట్స్ పాలసీలు తీసుకొచ్చినట్లు తెలిపారు. దీని ద్వారా క్రీడాకారులకు ఉద్యోగావ కాశాలతోపాటు భారీనజరానాలు లభించనున్నాయన్నారు. ప్రతీ క్రీడాకారుడు అంకితభావంతో శిక్షణ పొందితే క్రీడలో రాణించవచ్చన్నారు. అనంతరం సీనియర్స్ విభాగంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధానకార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, పెటా అధ్యక్షుడు అంతటి శంకరయ్యగౌడ్, కోచ్‌లు జి రామకృష్ణ, పి మల్లేశ్వరి, పి సాగర్, ఎ ఆనంద్ కిషోర్, స్వరూపచారి, వీణ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంపై రైతులు ఆసక్తి చూపాలి

● సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ ఎం లత


సిరిసిల్ల రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయంతోపాటు పట్టుపురుగుల పెంపకంపై దృష్టి సారించాలని సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ ఎం లత సూచించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల రైతువేదికలో పట్టుపురుగుల పెంపకంపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ డైరెక్టర్ లత మాట్లాడుతూ ప్రస్తుతం పట్టుపురుగుల పెంపకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రైతులు పట్టుపురుగుల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ పంటల కంటే పట్టుపురుగుల పెంపకంలో అధిక లాభాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మైసూర్ సీఎస్‌బీ, సీఎస్ఆర్‌టీఐ శాస్త్రవేత్త డాక్టర్ మల్లికార్జున, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కేఆర్ లత, ఏడీఏ ఇంద్రసేనా రెడ్డి, డాక్టర్ రామచేందర్, ఆర్ఎస్ఆర్ఎస్ జిల్లా ఏఎస్‌ఓ జగన్, బోనాల ఏఈవో రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ నాగరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నబోనాలలో మాట్లాడుతున్న సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ లత

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

● 16 గేట్లు ఎత్తి 49,280 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. వరద నీరు రాక పెరగడంతో గురువారం అర్ధరాత్రి 12గంటలకు 16గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కుల నీటిని వదిలారు. కాగా ఎస్సారెస్పీలోకి 78,812క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా వరదగేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 78,812క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయకాలువకు 6,500 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతుండగా 651 క్యూసెక్కుల నీరుఆవిరి అవుతోంది. కాగా ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 128.384 టీఎంసీ నీరు రాగా, 61.449 టీఎంసీల నీరును వదిలారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటిప్రవాహం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరదగేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో ప్రస్తుత సీజన్‌లో ఈనెల 18న తొలిసారిగా 39వరదగేట్లు పైకి ఎత్తి దిగువకు నీటిని వదిలారు. క్రమక్రమంగా వరద గేట్లను ఎత్తుతూ 41గేట్ల ద్వారా సుమారు 2 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని గోదావరికి వదిలిపెట్టారు.

గాయత్రి పంపుహౌస్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల..



గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒకపంపు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అదినేరుగా వెళ్లి వరద కాలువలో కలుస్తోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు నీరు పోటెత్తుతుండడంతో గాయత్రి పంపుహౌస్ నుంచి పంపుల సంఖ్యను తగ్గించారు. గాయత్రి పంపుహౌస్ నుంచి 3150 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 19వేల క్యూసెక్కుల నీరు వరదకాలువ 99కిలోమీటర్ల వద్ద కలుస్తున్నాయి. దీంతో ప్రస్తుతం వరదకాలువ మిడ్‌మానేరుకు 22150 క్యూసెక్కుల నీరు తరలివెళ్తోంది. అయితే మిడ్‌మానేరుకు 20వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. అలాగే 88కిలో మీటర్ వద్ద నుంచి 2150క్యూసెక్కుల నీటిని ఎల్ఎండీకి తరలిస్తున్నారు. మరో వెయ్యి క్యూసెక్కుల నీరు అదనంగా చేరడంతో వరదకాలువ నిండుకుండలా తయారవడంతో రైతుల కళ్లలో ఆనందం కదలాడుతోంది.

మిడ్‌మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నీటితోపాటు, మూలవాగు, మానేరుద్వారా నీటిప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి శుక్రవారం సాయంత్రం వరకు 19,032క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 15,782క్యూసెక్కులు, గాయత్రి పంప్ హౌస్ నుంచి 3,150క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగుద్వారా 100క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు గాను ప్రస్తుతం 313.35 మీటర్ల వరకు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకుగాను 17.079టీఎంసీల నీరు నిల్వ ఉండగా, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.15 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 9,600 క్యూసెక్కుల నీరు రాగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి విడుదల అవుతున్న నీరు

రెగ్యులర్ ఫిజికల్ డైరెక్టర్‌ను కార్యదర్శిగా నియమించాలి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ కళాశాలల అండర్-19 కార్యదర్శి నియామకం నిబంధనల మేరకు చేపట్టాలని, రెగ్యులర్ ఫిజికల్ డైరెక్టర్లలో ఒకరిని నియమించాలని గురుకులకళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సంఘం కోరింది. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఇంటర్‌విద్యాశాఖ అధికారి గంగాధర్‌కు వినతిపత్రం అందజేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి ఎస్‌జీఎఫ్ అండర్-19 కళాశాలల కార్యదర్శిగా జిల్లాలోని మోడల్ స్కూల్, కళాశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని నియమించడం బాధాకరమన్నారు. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో ఎందరో రెగ్యులర్ ఫిజికల్ డైరెక్టర్లు పనిచేస్తున్నారని, వారిని కాదని ఔట్ సోర్సింగ్ పీడీకి బాధ్యతలు అప్పగించడం సరికాదని అన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి అండర్-19 కార్యదర్శిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు భవానీ, రమేష్, ప్రసాద్, భగత్, సుమన్, శేఖర్, శివ, సురేష్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు

రోడ్డు పక్కన చెత్త వేసిన వ్యక్తి

● అతని చేతే తీయించిన మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్, ఆగస్టు 22: (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చెత్త పడవేసిన వ్యక్తిని గుర్తించి అతని చేతే చెత్తను తీయించారు మున్సిపల్ సిబ్బంది. సుల్తానాబాద్ బస్టాండ్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఎవరూ చూడడం లేదని రోడ్డుపక్కన చెత్తను పడేశాడు. మున్సిపల్ సిబ్బంది రోడ్డు పరిసరాలు చూడగా అక్కడ చెత్త కనిపించింది. అయితే చెత్తను పడవేసిన వ్యక్తి గురించి ఆరా తీసి గుర్తించిన మున్సిపాలిటీ సిబ్బంది అతని చేత రోడ్డు పక్కన వేసిన చెత్తను తొలగింప చేశారు. ఎవరూ కూడా చెత్తను రోడ్ల పై, ఖాళీ ప్రదేశాలలో కానీ వేయవద్దని, చెత్త డబ్బాలలో వేసి ఇంటికి వచ్చే వారికి అప్పగించాలని కమిషనర్ రమేష్ ప్రజలకు సూచించారు. చెత్తను రోడ్ల పైవేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. జరిమానాలు విధిస్తామన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



మహమ్మద్ ముదస్సర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అప్పులు ఎక్కువై, సరైన ఉపాధి లభించక మంచిర్యాలజిల్లా బెల్లంపల్లికి చెందిన మహమ్మద్ ముదస్సర్(39) కరీంనగర్‌లోని ఓహోటల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. మహమ్మద్ ముదస్సర్ 2007లో హైదరాబాద్‌వెళ్లి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ స్నేహితులతో కలిసి అద్దెఇంటిలో ఉన్నాడు. కొద్ది రోజుల కిందట అతడి తండ్రి మహ్మద్ సాధిక్‌పాషాకు స్నేహితులు ఫోన్ చేసి ముదస్సర్‌కు రూ.5లక్షల అప్పు అయ్యిందని, సరైన ఉద్యోగం దొరకడంలేదని, అప్పు ఎలా తీర్చాలంటూ బాధపడుతున్నాడని తెలిపారు. దీంతో ముదస్సర్‌కు తండ్రి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ నెల1న ముదస్సర్ తన తండ్రికి ఫోన్ చేసి వారం రోజుల్లో ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు. కానీ వెళ్లలేదు. శుక్రవారం 11గంటలకు అతడి స్నేహితుడికి ఫోన్‌చేసి చనిపోతున్నట్లు చెప్పి కట్ చేశాడు. వెంటనే హైదరాబాద్‌లో ఉన్న మృతుడి సోదరుడు తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఫోన్ లొకేషన్‌ను కరీంనగర్ శ్వేతహోటల్‌గా గుర్తించారు. వచ్చి చూడగా హోటల్‌గదిలో ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ లెటర్ ఉన్నట్లు, ముదస్సర్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం బుధవారం అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబు శుక్రవారం కరీంనగర్‌లో ఎమ్మెల్యేను పరామర్శించారు. మంత్రి వెంట సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్‌బాబు, మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి కాశిపాక రాజేశ్, సీనియర్ నాయకులు నాగిశేఖర్, పోతారం సురేందర్, సమద్ నవాబ్, మడుపు మోహన్ ఉన్నారు.



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- జిల్లాలో 'ఉపాధి' పనుల జాతర ప్రారంభం




ఎగ్లాస్‌పూర్‌లో పాడి గేదెను రైతుకు అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్, బోయినపల్లి మండలంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కోనరావుపేట/చందుర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఉపాధిహామీ పనుల జాతరలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం వారి ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో, చందుర్తి మండలం సనుగుల గ్రామంలో లబ్ధిదారులకు పాడి గేదెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గతంలో ప్రతి గ్రామంలో పశు సంపద ఉండేది కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా పశు సంపద తగ్గిపోతుందని అన్నారు. ప్రస్తుతం మారుమూల ప్రాంతాల్లో సైతం పాల ప్యాకెట్లపై ప్రజలు ఆధారపడుతున్నారని అన్నా రు. లబ్ధిదారులు ముందుకు వస్తే ప్రతి ఇంటికి ఒక గేదెను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందజేస్తామని తెలిపారు. పాడి పరిశ్రమతో పాటు చేపల, కోళ్ల పెంపకం వైపు వెళ్లాలని అన్నారు. మన ప్రాంతంలో మిడ్ మానేరు, ఎగువ మానేరు, మల్కాపేట రిజర్వాయర్ వీటితో పాటు ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు మత్స్య సంపద పెంపొందడానికి తోడ్పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం గ్రామంలోని తాళ్లపల్లి కవిత, మంగలి రిబ్సిక ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, జిల్లా పశు వైద్యాధికారి రవీందర్, కోనారావుపేట తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

● నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

బోయినపల్లి: నియోజకవర్గ అభివృద్ధికి అనుక్షణం కృషి చేస్తున్నట్టు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు బోయినపల్లి మండల కేంద్రంతో పాటు స్తంభంపల్లి గ్రామంలో పనుల జాతర కార్యక్రమంలో ఎమ్మెల్యే వేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్‌యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, డీఆర్డీవో శేషాద్రి, ఎంపీడీవో జయశీల, డిప్యూటీ తహసీల్దార్ భూపేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వస్నెల రమణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు వేసిరెడ్డి దుర్గారెడ్డి, జోగినపల్లి వెంకట రామారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో 80వేల రూపాయల వ్యయంతో నిర్మించిన పశువుల పాకను ప్రారంభించారు. మండేపల్లి గ్రామంలో ఐదు లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పద్మనగర్ శివారులోని కస్తూర్బా పాఠశాల వద్ద పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి చేశారు. పూర్తయిన నిర్మాణాలను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పనులు పూర్తి చేసిన కూలీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు సబేరాబేగం, రాములునాయక్, మండల ప్రత్యేక అధికారులు అఫ్జల్‌బేగం, రాందాస్, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపీడీవోలు సత్తయ్య, బీరయ్య, ఏవో రాజశేఖర్, ఏపీవోలు నర్సయ్య, శ్రీహరి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, గౌస్, మల్లేశం, బాల్‌రెడ్డి, మహేందర్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, తిరుపతి, మదన్‌లాల్, చంద్రమౌళి, కాంతయ్య, సంతోష్‌నాయక్, గోవింద్‌నాయక్, గజన్‌లాల్‌నాయక్, రాములు నాయక్, రాజు, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాల్లో పనుల జాతరలో భాగంగా వివిధ పనులకు శుక్రవారం భూమిపూజలు చేశారు. ముస్కానిపేట, అనంతారం, పొత్తూరు తదితర గ్రామాల్లో ఇంకుడు గుంతలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజలు చేశారు. వందరోజుల పనులు పూర్తిచేసిన ఉపాధిహామీ కూలీలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో చంద్రయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలత పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని నాగాయపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనుల జాతర భాగంగా పశువుల షెడ్డును మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీడీ నరసింహులు, ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి జీవన్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ రకాల పనులకు ఎంపీడీవో శంకర్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఎగ్లాసపూర్ గ్రామంలో గుంటి హరీష్ అనే రైతు పశువుల పాకకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గూడ శంకర్ రెడ్డి, ఏపిఎం మంచికట్ల శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ పీఆర్ఏఈ అంజయ్య, ఎంపీవో ఆరిఫ్, ఉపాధి హామీ అధికారులు గణేష్, కార్యదర్శి రజిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని సనుగులలో శుక్రవారం పశువుల పాకను ఎంపీడీవో రాధ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో రాజయ్య, ఎంపీవో ప్రదీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, ఏఈ, ఉపాధి హామీ కూలీలు, రైతులు పాల్గొన్నారు.




తంగళ్లపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ నారాయణపూర్‌లో చెక్‌డ్యాంను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం

పల్లె మురిసేలా 'అభివృద్ధి' జాతర

(5వ పేజీ తరువాయి)



పశువుల పాకకు భూమి పూజ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

మార్చిలోగా పూర్తి చేయాలని లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. తొలిరోజు శుక్రవారం..జిల్లాలో 7.79 కోట్ల రూపాయలతో 255 పనులు ప్రారంభించారు. ఇందులో 57.06 లక్షల రూపాయలతో 60 పశువుల పాకలు, 10.46 లక్షల రూపాయలతో ఏడు గొర్రెల షెడ్లు, 5.69 కోట్ల రూపాయలతో 42 సీసీ రోడ్ల నిర్మాణం, 15.85 లక్షల రూపాయలతో ఆరు కోళ్ల షెడ్లు, 2.63 లక్షల రూపాయలతో 21 కమ్యూనిటీ ఇంకుడుగుంతలు, తొమ్మిది లక్షల రూపాయలతో మూడు శానిటరీ కాంప్లెక్స్‌లు, 1.12 కోట్ల రూపాయలతో ఇతర పనులకు భూమి పూజలు చేశారు.

● కూలీలకు ఉపాధి కల్పన..

గ్రామీణ ప్రాంతాల్లో పనుల్లో వేగం పెరగడంతో పాటు ఉపాధి కూలీలకు అధిక పనులతో జీవనోపాధి కల్పించాలని ఉపాధిహామీ పనుల జాతర రూపొందించారు. జిల్లాలో 98,032 జాబ్ కార్డులు ఉండగా 1.99 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇందులో 93,313 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న ప్రగతిని క్షేత్రస్థాయిలో అధికారులు తాజా ఫొటోలతో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

పట్టు పరిశ్రమ కేంద్రం సందర్శన



కోళ్లమద్ది పట్టు పరిశ్రమ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ లత

గంభీరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కోళ్ళమద్ది గ్రామంలో శుక్రవారం పట్టు పరిశ్రమ కేంద్రాన్ని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ లత సందర్శించారు. పట్టు పరిశ్రమ స్థితిగతులు, భవనాల పరిస్థితి పరిశీలించారు. ఇటీవల 10 లక్షల రూపాయల అంచనాలతో చేపట్టిన స్థల పరిరక్షణ ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. ఆమె వెంట ఏడీ రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

తంగళ్లపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గతంలో బతికుండగానే బంధువులు స్మశానంలో వదిలేసిన వృద్ధురాలిని అమ్మ వృద్ధాశ్రమం చేరదీసింది. ఏడాది పాటు వృద్ధురాలికి వృద్ధాశ్రమం నిర్వహకులు సేవలు చేయగా శుక్రవారం మృతి చెందింది. అన్ని తామై అమ్మ వృద్ధాశ్రమం నిర్వహకులు వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. పద్మనగర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా కూకుట్ల రాజవ్వ పని చేస్తుంది. భర్త, పిల్లలు ఎవరు లేక ఒంటరిగానే జీవిస్తుంది. ఈ క్రమంలో ఏడాది క్రితం వయోభారం మీద పడడంతో పాటు అనారోగ్యానికి గురైంది. బంధువుల మధ్య గొడవల నేపథ్యంలో రాజవ్వ బ్రతికుండగానే స్మశాన వాటిక అవరణలో గదిలో వదిలి పెట్టారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా స్పందించి వృద్ధురాలికి చికిత్స చేయించి ఆశ్రయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాజవ్వకు జిల్లా సంక్షేమ అధికారి హైదరబాద్‌లోని గాంధీ అసుపత్రిలో చికిత్స చేయించారు. వృద్ధాలిని పోషించాడానికి బంధువులు తిరస్కరించడంతో అమ్మ వృద్ధాశ్రమం నిర్వహకుడు అన్నారం తిరుమల శ్రీనివాస్ ఆశ్రయం కల్పించి సేవలు అందించారు. రాజవ్వ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. వృద్ధాశ్రమం నిర్వాహకుడు రాజవ్వ మృతదేహనికి అంత్యక్రియలు నిర్వహించాడు. వారికి గడ్డం కృష్ణవంశీ, దిలిప్ కుమార్, గడ్డం పురుషోత్తం, కనకమ్మలు సహకరించారు. అంత్యక్రియాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది, మృతురాలి బంధువులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి ముందస్తు అరెస్ట్

బోయినపల్లి ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మండల పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి శుక్రవారం మండలానికి వచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిడ్ మానేరు ముంపు గ్రామ ఐక్యవేదిక కన్వీనర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుస రవీందర్‌ను వేములవాడ రూరల్ సీఐ ఆదేశాల మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే పర్యటన అనంతరం రవీందర్‌ను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా కుస రవీందర్ విలేకరులతో మాట్లాడారు. బోయినపల్లి ఎస్సై పై తాను ఎస్పీకి ఫిర్యాదు చేయకున్నా కొదురుపాక గ్రామానికి చెందిన కొంతమంది చెప్పుడు మాటలు విని ఎమ్మెల్యే తనను ఇష్టానుసారంగా దూషించాడన్నారు. తనను దూషించడానికి గల కారణాన్ని ఎమ్మెల్యేను అడిగేందుకు బోయినపల్లికి వచ్చానన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని వేములవాడ తరలించి వదిలిపెట్టారన్నారు. 20 ఏళ్లుగా కష్టనష్టాలకు ఓర్చి పార్టీ కోసం పనిచేస్తున్నానని తెలిపారు. అయితే ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో సీనియర్ నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

మహా గర్జనను విజయవంతం చేయాలి



వెంకట్రావుపేటలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు భిక్షపతి

కోనరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 9న నిర్వహించే మహా గర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఎలగందుల భిక్షపతి కోరారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో శుక్రవారం వృద్ధులు, వికలాంగులు, బీడీ కార్మికులు, వితంతువులు నేత కార్మికులు గీత కార్మికుల సమావేశాన్ని నిర్వహించి, వెంకట్రావుపేట గ్రామంలో బీడీ కార్మికులు వృద్ధులు వికలాంగుల నూతన కమిటీని ఎన్నిక చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచుతానన్న పెన్షన్లు పెంచడం లేదని దానికి నిరసనగా 45 లక్షల పెన్షన్ దారులతో సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో మహా గర్జనను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మహా గర్జనకు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ హాజరవుతారని ఈ కార్యక్రమాన్ని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామీణ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎదగాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి వెళ్లాలని ఎంఈవో రాజు నాయక్ సూచించారు. శుక్రవారం మండల స్థాయి బాలుర క్రీడాకారుల ఎంపిక తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల అవరణలో జరిగాయి. మండలంలోని పలు పాఠశాలలో చదువుతున్న బాలురకు మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను ఎంఈవో రాజు నాయక్, పాఠశాల హెచ్ఎం శంకర్ నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోని రాణించాలన్నారు. ఎస్‌జిఎఫ్ క్రీడలు గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి దోహద పడతాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పరిధిలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముష్టిపల్లి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి వేములవాడ వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. వేములవాడ ఆర్టీసీ డిపో సమీపంలో ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదు. ప్రమాదంలో రాజు తలకు తీవ్ర గాయాల కావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ మొగిలి

ఇల్లంతకుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం వినాయక మండప నిర్వాహకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతు వినాయక మండపాల నిర్వాహకులు తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండపాలను ప్రజలకు ఇబ్బందులు కలగని ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై సిరిసిల్ల అశోక్‌తో పాటు వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

చందుర్తి: గణేష్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. చందుర్తి మండల పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. గణేష్ ప్రతిమ ఎత్తు, మండపం ఏర్పాటు చేసే స్థలం, నిమజ్జనం తేదీ, నిమజ్జనం ప్రదేశం వంటి వివరాలను తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్ నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి అధికారులు అనుమతులు జారీ చేస్తారన్నారు. అనుమతి పత్రం, క్యూఆర్ కోడ్, పోలీస్ సూచనలను మండపం వద్ద స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్లు విద్యుత్ శాఖ అనుమతితోనే తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా నాణ్యత గల వైర్లు వాడాలని సూచించారు.

శబ్ద కాలుష్య నివారణకు కేవలం రెండు స్పీకర్లు మాత్రమే వాడాలని, వృద్ధులు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరిమిత శబ్దంతో పాటలు పెట్టాలన్నారు. కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అసభ్యకర నృత్యాలు చేయడం పూర్తిగా నిషేధమన్నారు. మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ప్రసంగాలు లేదా పాటలు ప్రదర్శించకూడదన్నారు. పోలీస్ తనిఖీల కోసం మండపం వద్ద ఒక పాయింట్ పుస్తకం తప్పనిసరిగా ఉంచాలని పేర్కొన్నారు. అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గణేష్ నవరాత్రులు శాంతియుతంగా, సురక్షితంగా జరగడానికి అన్ని మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అతిథులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా చైర్ పర్సన్ డాక్టర్ లీలాశిరీషా సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును నిర్వహించారు. డాక్టర్ లీలాశిరీషా ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచితంగా రక్త పరీక్షలను చేయించారు. అనంతరం డాక్టర్ లీలా శిరీషాను కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు సన్మానించారు. అనంతరం కళాశాల నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినులతో పాటు రసాయన శాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతులు, నగదు పుర స్కారాలను అందించి అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ జి వనజా కుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మడుపు నవీన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కొడిమ్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామంలోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం మండల బీజేపీ నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పుట్టిన రోజును సందర్భంగా మోదీ గిఫ్ట్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి, చెప్యాల గ్రామ మాజీ సర్పంచురాజశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు బుచ్చిరాములు, రవీందర్, ప్రదానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్వాడీ దుకాణాల మూసివేత



వేములవాడలో మూసి ఉన్న దుకాణాలు

సిరిసిల్ల/వేములవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మార్వాడి గో బ్యాక్- మన రాష్ట్రం, మన దుకాణాలు అన్న నినాదంతో జరుగుతున్న ఆందోళన నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ బంద్‌కు ఓయూ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు వేములవాడలో వ్యాపార, వర్తక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మార్వాడీల దుకాణాలను మూసివేయించారు. తెలంగాణలో మార్వాడీలు ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని, గో బ్యాక్ మార్వాడి అంటూ నినాదాలు చేశారు.

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మర్వాడీలు పల్లెల్లో వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా తమ చేతి వృత్తుల ఉపాధి కోల్పోతున్నామని పేర్కొంటూ ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలువురు వ్యాపారులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. మర్వాడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వ్యాపారులు

రాజా బహదూర్ వెంకటరామరెడ్డి జయంతి వేడుకలు




సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటలో రాజా బహదూర్ వెంకటరామరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో రాజా బహదూర్ వెంక రామరెడ్డి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేద రెడ్డి బిడ్డల శ్రేయస్సు కోసం వెంకటరామరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. నిజాం కాలంలో కోత్వాల్ పదవిలో ఉండి అసాంఘిక కార్యాక్రమాలను జరగకుండా ధైర్యంగా నిలబడి అనతికాలంలోనే ఎంతో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. అనేక రంగాల్లో పేద రెడ్డి బిడ్డల కోసం సహాయ సహకారాలు అందించారన్నారు.

కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కోర్ కమిటి సభ్యుడు ఎడమల తిరుమలరెడ్డి, ఉపాధ్యక్షులు ఎగమామిడి కృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శి ఏమిరెడ్డి కనకారెడ్డి, కోశాధికారి ఏడుమల హనుమంతరెడ్డి, సభ్యులు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, కంకణాల శ్రీనివాస్‌రెడ్డి, కంది భాస్కర్‌రెడ్డి, అబ్బాడి తిరుపతిరెడ్డి, భూపాల్‌రెడ్డి, వేసిరెడ్డి రామ్‌రెడ్డి, ఉప్పల లక్ష్మారెడ్డి, అబ్బాడి అనిల్‌రెడ్డి, రాగిపెల్లి కృష్ణారెడ్డి, కొండల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని నేపూరి రెడ్డి(మాలీసు)సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజా బహదూర్ వెంకటరామరెడ్డి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజా బహదూర్ వెంకటరామరెడ్డి గొప్ప సంఘ సేవకులని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి, లింగారెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వేణురెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సంఘం భవనంలో రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి చిత్ర పటానికి రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడ్మాల బాల్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సమాజానికి చేసిన సేవలను స్మరించుకు న్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం ఉపాధ్యక్షుడు ఎగుమా మిడి కృష్ణారెడ్డి, కోశాధికారి ఎడ్మల హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆసాని సత్యనారాయణరెడ్డి, నాయకులు జయరాంరెడ్డి, ఎడ్మల ప్రతాప్‌రెడ్డి, దోర్నాల సంజీవరెడ్డి, గంగ కృష్ణారెడ్డి, ఆసాని లక్ష్మారెడ్డి, ఆసాని భాస్కర్ రెడ్డి, ఏరా శ్రీనివాస్‌రెడ్డి, అంకిల్ల దుర్గారెడ్డి, ఆసాని వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.